విద్యాసంస్థల బంద్‌ ప్రశాంతం

రామంతాపూర్‌: విద్యా సంస్థల బంద్‌ విజయవంతమైంది. నీట్‌ పరీక్ష తిరిగి నిర్వహించాలని డిమాండ్‌ చేస్తూ.. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్‌ రామంతాపూర్‌ పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. నేటి యుజీసీ ఎన్‌ఈటీ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేరని పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్‌ చేశారు. ప్రతినిధులు అవినాష్‌, శ్రీమాన్‌, పవన్‌, ముత్తు సాయి, చరణ్‌, ప్రభు తదితరులున్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

ఉప్పల్‌: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని ఉప్పల్‌ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌ భరత్‌నగర్‌లో రేషన్‌ బియ్యాన్ని నిల్వచేసి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో ఉప్పల్‌ పోలీసులు పక్కా సమాచారంతో వాహనాన్ని తనిఖీ చేశారు. తనిఖీల్లో 60 బ్యాగుల బియ్యం (మూడు టన్నులు) గుర్తించారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న తుర్కపల్లి ప్రాంతానికి చెందిన రమావత్‌ విఘ్నేషను అదుపులోకి తీసుకుని అరెస్ట్‌ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాసశివరాత్రి ప్రత్యేక పూజలు



గౌతంనగర్‌: మాసశివరాత్రిని పురస్కరించుకుని గౌతంనగర్‌ డివిజన్‌ ఉత్తమ్‌నగర్‌లోని శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో గురువారం రుద్రహోమం సహా ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు నాగరాజుశర్మ, భక్తులు తదితరులున్నారు.



తుమ్మ చెరువును పట్టించుకునేదెవరు ?



రంగు మారిన తుమ్మ చెరువు నీరు

కంపుతో కాలనీల వాసుల సతమతం

- డ్రైనేజీ నీరు చెరువులో కలవడంతో రంగు మారుతున్న నీరు
- కట్టపైనుండి చెత్తవేస్తున్న ప్రజలు
- కట్టపైనే యువకుల దమ్‌మారో దమ్‌



తుమ్మ చెరువులో ప్రజలు వేసిన చెత్త

మేడ్చల్‌: పట్టణంలోని తుమ్మ చెరువులో వ్యర్థాలను, చెత్తను ఇష్టానుసారంగా పడేస్తుండటంతో తుమ్మ చెరువు కంపుకొడుతోంది. ఆర్టీసీ కాలనీ, వినాయక్‌ నగర్‌ కాలనీ పై భాగంలో సూర్యనగర్‌, మల్లికార్జున నగర్‌, రైల్వేస్టేషన్‌ కాలనీలు, మరో వైపు సాయిబాబా గుడి కాలనీలు, ఇందిరానగర్‌, తదితర కాలనీలకు సమీపంలో ఉన్న తుమ్మ చెరువు పట్టణ ప్రజల భూగర్భ నీరు అందించడంలో కీలక భూమిక భూమిక పోషిస్తున్న చెరువు. కాలనీల మధ్య ఉండటంతో అధికారులు, పాలకులు ఎన్ని ఆదేశాలు జారీ చేస్తున్నా ఎన్ని సార్లు శుభ్రం చేస్తున్నా కాలనీల వాసులు తమ ఇళ్ల నుండి వచ్చే వ్యర్థాలను, చెత్తను తీసుకవచ్చి చెరువు అంచులలో పడేస్తుండటంతో చెరువు దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త చెరువు అంచులలో నుండి నీటిలోకి చేరి నిల్వ ఉండటంతో దుర్గంధంతో పాటు దోమలు పెరుగుతున్నాయి. దీంతో కాలనీలలో చెరువు సమీపంలో ఉండే వారు ఇబ్బందులు పడుతున్నారు. సమీప కాలనీలలో దోమల బెడద ఎక్కువగా తయారయ్యింది. ఒక వైపు నుండి చెత్తచెదారం వేయడం,మరో వైపు నుండి మురికి నీరు తుమ్మ చెరువులోకి వదిలేయడంతో చెరువులో నీరు పూర్తిగా రంగు మారి కంపుమయంగా తయారైంది.

హెచ్చరికలను పట్టించుకోని ప్రజలు

కట్టపై, చెరువులో చెత్త వేయవద్దని వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని మున్సిపల్‌ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా అవి బోర్డులకే పరిమితమయ్యాయి. అధికారులు భాధ్యత లేకుండా చెత్త వేస్తున్న వారిపై కొరడా ఝులిపించాల్సిన అవసర ఎంతైనా ఉండటంతో పాటు చెరువు లోకి మురుగు నీరు రాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పట్టణంలోని పలు దుకాణాల వారు తమ వ్యర్థాలను చెరువు నీటిలో వేస్తున్నారు. చెత్త వేయకుండా సీసీ కెమరాలు ఏర్పాటు చేసి ,జరిమానాలు విధిస్తే కొద్ది మేరకైన కంపు కంట్రోల్‌ అవుతుంది.

తాగుబోతులకు అడ్డాగా..

కాలనీలకు సమీపంలో తుమ్మ చెరువు ఉండటంతో కట్టపై కొంతమంది తాగుబోతులు అడ్డాగా చేసుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. కొంతమంది గంజాయి సేవిస్తూ మద్యం తాగుతూ అడ్డాగా మార్చుకున్నారు. కొంమతంది ఆటో వాలలు ఆటో లు పార్క్‌ చేసి అందులో కూర్చొని తాగుతున్నారు.

కలుషితమవుతున్న భూగర్భ జలాలు..

పది కాలనీల వరకు భూగర్భ జలాలు అందించే తుమ్మ చెరువు మురికి నీటితో కలుషితం అవుతుండటంతో భూగర్భ జలాలు క్రమేపి కలుషితమవుతున్నాయి. చెరువు సమీపంలో ఉన్న బోర్లలో ఇప్పటికే నీరు రంగు మారి వస్తున్నాయి. పరిస్థితి చేజారకముందే చెరువును కలుషితం బారి నుండి కాపాడాల్సిన భాధ్యత మున్సిపల్‌ పాలకవర్గందే.

అభివృద్ధి చేసినా..

చెరువు కట్టను ఎమ్మెల్యే మల్లారెడ్డి గతంలో ఆయన మంత్రిగా ఉన్న సమయంలో తన జేబులో నుండి రూ.20లక్షలు వెచ్చించి సిమెంట్‌ రోడ్డు వేయించారు. కొద్ది మేరకు కట్టమైసమ్మ ఆలయం వరకు మున్సిపల్‌ తరుపున వీధి దీపాలు ఏర్పాటు చేశారు. సిమెంట్‌ రోడ్డు వేయడంతో కట్ట విశాలంగా మారింది. వాహనాల రాకపోకలు పెరిగాయి. జాతీయ రహదారి పైకి వెళ్ళకుండా పాత,కొత్త మేడ్చల్‌ అనుసంధానంగా కట్ట మారింది. కట్ట అందంగా తయారైనా దుర్వాసనతో ఆ ప్రాంతం కాలనీల వాసులకు ఉపయోగం లేకుండా పోయింది. ఉదయం ,సాయంత్రం పాద చారులు కాసేపు వాకింగ్‌ చేయడానికి వీలు లేకుండా తయారైంది.

నిధుల మంజూరు ఎప్పుడో...

తుమ్మ చెరువు లో డ్రైనేజీ నీరు కలవకుండా పై భాగంలో ఉన్న కాలనీల నుండి డ్రైనేజీ నిర్మించి హౌజింగ్‌ బోర్డు కాలనీ మీదుగా వెళ్ళె ప్రధాన డ్రైనేజీ లో కలపాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి దాని కోసం దాదాపు రెండు కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసి ప్రతిపాదనలు ప్రభుత్వంకు పంపినా నిధులు మాత్రం విడుదల కాలేదు. చెరువు నిండక ముందే అధికారులు చెరువులో డ్రైనేజీ నీరు కలవకుండా పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య విభాగంలో కారుణ్య నియామకాలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: ప్రజలకు మెరుగైన సేవలందించాలంటే పారిశుద్ధ్య విభాగంలో సిబ్బందిని పెంచడంతో పాటు కారుణ్య నియామకాలు చేపట్టాలని మల్కాజిగిరి కార్పొరేటర్‌ శ్రవణ్‌ విజ్ఞప్తి చేశారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో శానిటేషన్‌పై జరిగిన ప్రత్యేక సమావేశంలో కార్పొరేటర్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల్లో ఇంటింటికీ ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగేలా చూడాలన్నారు. ప్రైవేటు సంస్థ రాంకీ పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయని నివేదిక తయారు చేయాలని మేయర్‌ను కోరామని, దీనికి అంగీకరించారన్నారు. మెరుగైన ఫలితాలు సాధించాలంటే ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోరని కొత్త వారిని తీసుకోవడంతో పాటు చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యులతో కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరామన్నారు.

కార్పొరేటర్‌ పర్యటన



ఓల్డ్‌ మల్లాపూర్‌ బస్తీలో స్థానికులతో కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్‌: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బస్తీలో పర్యటించినట్లు మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఓల్డ్‌ మల్లాపూర్‌ బస్తీలో కార్పొరేటర్‌ పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఇంటింటికీ తిరిగి అడిగి తెలుసుకున్నారు. బస్తీలో సీసీరోడ్డు వేయాలని కార్పొరేటర్‌ను కోరారు. గతంలో ఓల్డ్‌ మల్లాపూర్‌లో ప్రధాన సమస్య డ్రైనేజీ ఉండేది, నూతనంగా భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించినందుకు బస్తీవాసులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్‌, పీఆర్‌, ప్రవీణ్‌, దయాకర్‌రెడ్డి, చెరుకు నాగరాజు, శ్రీనివాస్‌, రఘు తదితరులున్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో స్థానికులు

గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని భవానీనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. గత కొంతకాలంగా కాలనీలో మౌలిక వసతులతో పాటు సీసీరోడ్లు, డ్రైనేజీ, ఇతర పనులు పెండింగ్‌లో ఉన్నాయని, నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవానీనగర్‌ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే క్రాసింగ్‌ సమస్యలు పరిష్కరించండి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్‌ పరిధిలో రైల్వే లెవెల్‌ క్రాసింగ్‌ల వద్ద సమస్యను పరిష్కరించాలని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌ డీఎస్‌ వెంకటేష్‌ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్‌ నాయకులు దక్షిణ మధ్య రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేశారు. డీఎస్‌. వెంకటేష్‌ మాట్లాడుతూ.. వాజుపేయినగర్‌, కాకతీయనగర్‌, గౌతంనగర్‌ వద్ద తరచూ రైల్వే గేట్‌ పడుతుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్వరితగతిన ఆర్‌యూబీల నిర్మాణం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సఫిల్‌గూడ వద్ద గేట్‌ శాశ్వతంగా మూసివేశారని చిన్న వాహనాలు వెళ్లేందుకు లో లెవల్‌ బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే ప్రాజెక్టుల్లో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం కాలేమని ఇప్పటికే లేఖలు ఇచ్చారని రైల్వే విభాగం నుంచి పనులు చేపట్టాలని కోరామన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కలిసి సమస్యను వివరిస్తామన్నారు. నాయకులు రాంబాబు, రామకృష్ణ, వాశంశెట్టి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



జీఎంకు వినతిపత్రం అందజేసిన డీఎస్‌. వెంకటేష్‌

అదనపు తరగతి గది పనులకు శంకుస్థాపన



అవుషాపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: అవుషాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 15వ ఆర్థిక సంఘం, ఎస్‌ఎఫ్‌సీ నిధులు రూ. 11.15 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గది పనులు గురువారం శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, భానుయాదవ్‌, సాయిలు, సల్మాన్‌ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్‌: పట్టణంలోని 13వ వార్డులో రూ.25 లక్షల మున్సిపల్‌ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేడ్చల్‌ మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ దీపికనర్సింహా రెడ్డి ప్రారంభించారు. కౌన్సిలర్‌ మర్రి శ్రీనివాస్‌రెడ్డి తో కలిసి ఆమె నిర్మాణ పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. పట్టణంలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి ,సత్యనారాయణ, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌ పర్సన్‌, కౌన్సిలర్‌

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఉప్పల్‌: చిలుకానగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ బన్నాల గీత డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానికులతో కలిసి పర్యటించారు. మల్లికార్జుననగర్‌, మార్కండేయ టెంపుల్‌ వీధి, బాలేందర్‌ షాపు తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీవరేజ్‌ పైపులైన్‌ పనులు, తాగునీటి పైపు లైన్‌ పనులను పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బన్నాల ప్రవీణ్‌, ఎదుల కొండల్‌రెడ్డి, అశోక్‌ చారి, బింగి శ్రీనివాస్‌, జగన్‌, బాలేందర్‌కుమార్‌, నర్సింగ్‌ నేత తదితరులున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌ సమావేశంలో కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్‌: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని స్టాండింగ్‌ కమిటీ సభ్యులు అల్వాల్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాండింగ్‌ కౌన్సిల్‌ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి అవసరమైన పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారన్నారు. నిధులు మంజూరైన కొన్నిచోట్ల పనులు జరగడం లేదని తెలిపారు. అల్వాల్‌లోని చెరువుల పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను ప్రస్తావించారు అనంతరం జీహెచ్‌ఎంసీ మేయర్‌ రాజ్యలక్ష్మి, కమిషనర్‌ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

బన్సీలాల్‌పేట్‌: తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ మైనర్‌ బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గాంధీ నగర్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌.ఐ నాగరాజు రెడ్డి కథనం ప్రకారం.. అబ్దుల్‌ రజాక్‌ కుటుంబం గతంలో బన్సీలాల్‌ పేట్‌ ప్రాంతంలో నివాసముండేవారు. అయితే.. ఇల్లు ఖాళీ చేసి న్యూబోయిగూడకు వచ్చారు. మూడ్రోజుల క్రితం అతడి కూతురు (13) బన్సీలాల్‌పేట్‌కు వెళ్లి అక్కడ పాత స్నేహితులతో కలిసి ఆడుకొని ఇంటికి వచ్చింది. అంతదూరం వెళ్లి రావడంపై తల్లి మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనైన బాలిక తల్లితో మాట్లాడం మానేసింది. గురువారం ఓ గదిలో కెళ్లి తలుపులు వేసుకుంది. బలవంతంగా తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూసేసరికి ఉరేసుకొని ఉంది. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే బాలిక మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌

మల్లాపూర్‌: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆద్యుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మల్లాపూర్‌ ఎలిఫెంట్‌ సర్కిల్‌ సమీపంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ..

తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితోనే తెలంగాణ పోరాటం ఉవ్వెత్తున ఎగిసిందని మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌, భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. కొమురయ్య వర్ధంతి వేడుకలను దొడ్డి కొమురయ్య మనమడు దొడ్డి యాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశపాలన, దొరల దోపిడీకి వ్యతిరేకంగా కొమురయ్య పోరాడి అమరుడయ్యాడన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, ముత్యంరెడ్డి, మహేష్‌ కుమార్‌, రవీందర్‌రెడ్డి, నిర్మల, సబిత తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం సైనిక్‌పురి శ్రీసాయినగర్‌ కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు కేమిడి రవి, ఉపాధ్యక్షుడు ఉపేందర్‌, ఎమ్మ శ్రీను, ప్రధాన కార్యదర్శి వడ్లె కృష్ణ, మాజీ అధ్యక్షులు వగ్గు సత్తయ్య, సహ కార్యదర్శులు ధనుంజయ, పాండు, ఉపేందర్‌, రాంచందర్‌, సిద్దులు, వెంకటేష్‌, శ్రీను, విజయ్‌, కృష్ణ, రాజు, రాజశేఖర్‌ తదితరులున్నారు.

వివేకానందుని జీవితం యువతకు సందేశం



కుషాయిగూడలో నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్‌ ధన్‌పాల్‌రెడ్డి



వివేకానందుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కుషాయిగూడ: కుషాయిగూడలో వివేకానంద 122వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కుషాయిగూడ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన యువతకు ఇచ్చిన సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్‌ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, అసోసియేషన్‌ ప్రతినిధులు, స్థానిక నేతలు చక్రపాణిగౌడ్‌, ఆనంద్‌గౌడ్‌, చల్లా ప్రభాకర్‌, పంజాల బాబుగౌడ్‌, చిత్తుల కిషోర్‌, చల్లా వెంకటేశం, వెంకులు, దయానంద్‌, జనార్దన్‌, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

మల్కాజిగిరి: స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి బీజేపీ కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి, నియోజకవర్గ కన్వీనర్‌ డీఎస్‌ వెంకటేష్‌, నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్‌, నవీన్‌, కిరణ్‌, మంగేష్‌ తదితరులున్నారు.

భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటాడు..

గౌతంనగర్‌: భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహాపురుషుడు స్వామి వివేకానంద అని వివేకానంద రైసింగ్‌ సొసైటీ అధ్యక్షుడు కుమ్మరి రాజు అన్నారు. వివేకానంద రైసింగ్‌ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం గౌతంనగర్‌లో స్వామి వివేకానంద వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నితిన్‌కుమార్‌, అఖిల్‌, వినయ్‌, ప్రశాంత్‌, లలిత, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

కుషాయిగూడ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను మీర్‌పేట్‌–హెచ్‌బీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌, కార్పొరేటర్లు ప్రభుదాస్‌, పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై అల్లూరి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రిటిష్‌ సామ్రాజ్యానికి ఎదురొడ్డి నిలిచిన పోరాట యోధుడు అల్లూరి అని కొనియాడారు. మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, మునిగంటి రామ్‌ప్రదీప్‌, కాసం మహిపాల్‌రెడ్డి, గడియారం రామకృష్ణ, శేఖర్‌గౌడ్‌, వసంతరావు తదితరులున్నారు.



నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌, కార్పొరేటర్లు

విలీనానికి ముందే స్పష్టత కోరాం

కంటోన్మెంట్‌: జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్‌ విలీనానికి ముందే ఉద్యోగుల భవిష్యత్‌పై స్పష్టత ఇవ్వాలని కంటోన్మెంట్‌ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి, బీజేపీ నేత పరుశరామ్‌ అన్నారు. ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ముఖ్యంగా 13 ఏళ్లుగా కంటోన్మెంట్‌లో కారుణ్య నియామకాలు చేపట్టలేదని, తక్షణమే పూర్తిస్థాయి నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరామన్నారు. అంత్యంత దుర్భర పరిస్థితుల్లో కంటోన్మెంట్‌లో పనిచేస్తూ, ఉద్యోగ జీవితం పూర్తి కాకుండానే 125 మంది మరణించడం పట్ల మానవతా దృక్పథంలో ఆలోచించాలని విన్నవించామన్నారు. 5 శాతం నిబంధనల ఎత్తివేతపై సానుకూలంగా స్పందించే అవకాశముందన్నారు. హస్మత్‌పేట, తుర్కపల్లిలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌ యార్డు స్థలాలను కంటోన్మెంట్‌ సిబ్బంది ఇళ్ల స్థలాల కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నామని విలీనానికి ముందే ఇళ్ల స్థలాల కేటాయించాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరుశరామ్‌

హుస్సేన్‌ సాగర్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య



మనోహర్‌(ఫైల్‌)

రాంగోపాల్‌పేట్‌: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి హుస్సేన్‌ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సెక్రెటేరియట్‌ లేక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. న్యూమల్లేపల్లి, గోకుల్‌నగర్‌కు చెందిన మనోహర్‌ (33) ఫొటో గ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. 2018లో సింధూరతో వివాహం కాగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 2న మద్యం తాగి భార్యతో గొడవ పడటంతో భార్య అదేరోజు హబీబ్‌నగర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు స్టేషన్‌కు రమ్మని ఫోన్‌ చేశారు. ఆ తర్వాత ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేసుకుని కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్‌ కేసు నమోదు చేశారు. అదే రోజు రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మనోహర్‌ పింగలి వెంకయ్య విగ్రహం వద్ద హుస్సేన్‌ సాగర్‌ జలాల్లో శవమై కనిపించాడు.

స్కూల్‌ బ్యాగుల పంపిణీ



స్కూల్‌బ్యాగులు పంపిణీ చేసిన కాపు కులాల ఐక్యవేదిక ప్రతినిధులు

కుషాయిగూడ: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కాప్రా కాపు కులాల ఐక్యవేదిక ప్రతినిధులు పేద విద్యార్థులకు స్కూల్‌ బ్యాగులు పంపిణీ చేశారు. కాపుభవన్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు జీవీఎస్‌ రావు చేతుల మీదుగా బ్యాగులు అందజేశారు. సామాజిక సేవాభావనతో ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఐక్యవేదిక ప్రతినిధులు దేవరకొండ శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసరావు, దాసరి ప్రసాద్‌, నాగు, ఉంగరాల నాయుడు, కొల్లా రామారావు, బండి సాయి, రామాంజనేయులు, జయరాంప్రసాద్‌, రాంమోహన్‌రావు, కిషోర్‌ తదితరులున్నారు.

బోనాల జాతరకు ఏర్పాట్లు



దేవాలయం ముఖద్వారం వద్ద రోడ్డు నిర్మాణ పనులు

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో రాబోయే బోనాల పండుగ జాతర సందర్భంగా ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. సికింద్రాబాద్‌లో మహంకాళి అమ్మవారి జాతర మరుసటి వారం మల్కాజిగిరిలోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతర పెద్దఎత్తున జరుగుతుంది. ఈ సందర్భంగా ఓల్డ్‌ మల్కాజిగిరిలోని దేవాలయానికి వెళ్లే మార్గంలో దెబ్బతిన్న ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టారు. స్థానిక కార్పొరేటర్‌ శ్రవణ్‌ ఇప్పటికే జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాన్స్‌కో అధికారులతో ఆలయ ప్రాంతంలో చేపట్టాల్సిన పనులపై సమీక్ష నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి



ట్రక్‌ పార్క్‌ ఏరియాలో మొక్కలు నాటుతున్న ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌

మల్లాపూర్‌: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ అన్నారు. జనసంఘ్‌ వ్యవస్థాపకుడు దివంగత డాక్టర్‌ శ్యామా ప్రసాద్‌ ముఖర్జీ వర్ధంతి నుంచి జయంతి వరకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న సందర్భంగా గురువారం నాచారం ట్రక్‌ పార్క్‌ అసోసియేషన్‌ ఆవరణలో ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ మొక్కలు నాటారు. అసోసియేషన్‌ అధ్యక్షుడు పాతగాని గోపాల్‌గౌడ్‌, లక్ష్మారెడ్డి, అశోక్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహాగౌడ్‌, చంద్రమౌళి, ట్రక్‌ ఓనర్స్‌, డ్రైవర్లు, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.